PRGI NO: APTEL/26/A1204

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

విజయవాడ,హైదరాబాద్   సంపుటి 01   సంచిక 61 ఎడిటర్ : కలిదిండి రఘురామ రాజు  శుక్రవారం   05జూన్ 2026   వెల -3  పేజీలు -8

## ఏపీ రాజ్యసభ సీట్ల పంపకం పూర్తి.. టీడీపీకి 3, జనసేనకు 1

రాజ్యసభ సీట్ల పంపకాలపై కొలిక్కి వచ్చిన ఫార్ములా

టీడీపీకి మూడు, జనసేనకు ఒక స్థానం కేటాయింపు

ఈసారి బీజేపీకి దక్కని రాజ్యసభ అవకాశం


సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరిగిన సమావేశంలో తుది నిర్ణయం

జూన్ 18న నాలుగు స్థానాలకు జరగనున్న పోలింగ్

ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలకు సంబంధించి అధికార ఎన్డీఏ కూటమిలో సీట్ల పంపకం ఖరారైంది. కూటమిలోని ప్రధాన పార్టీ అయిన తెలుగుదేశం పార్టీ (టీడీపీ) మూడు స్థానాలను తీసుకోనుండగా, జనసేన పార్టీకి ఒక స్థానాన్ని కేటాయించారు. ఈ సర్దుబాటులో బీజేపీకి ఈసారి అవకాశం లభించలేదు.

### సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం

# 'అమరావతి ఐ' సహా కీలక ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్



లండన్ ఐ తరహాలో అమరావతిలో 'అమరావతి ఐ' నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 125 రోజులకు పెంచుతూ కీలక నిర్ణయం

రాష్ట్రానికి కొత్త విమానయాన పాలసీ, పర్యాటకాన్ని పెంచేలా బీచ్ షాక్‌ల ఏర్పాటు

అగ్రిగోల్డ్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టుకు సిబ్బంది నియామకం, సబ్ కమిటీ ఏర్పాటు



పోలవరం ఎడమ కాలువకు సవరించిన అంచనాలు, పలు పారిశ్రామిక ప్రాజెక్టులకు భూకేటాయింపులు

అమరావతి

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసే పలు చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాజధాని అమరావతికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చే 'అమరావతి ఐ' ప్రాజెక్టు నుంచి గ్రామీణ పేదల బతుకులకు భరోసా ఇచ్చే కొత్త ఉపాధి హామీ పథకం వరకు

2

## అమరావతిపై జగన్ వ్యాఖ్యలు నవ్వొచ్చేలా ఉన్నాయి: మంత్రి నారాయణ

అమరావతి ప్రాంత రైతుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్న నారాయణ

రాజధాని ప్రాంతాన్ని అస్థిరపరచాలని చూస్తున్నారని మండిపాటు

జగన్ క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని హితవు

అమరావతి



2

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు.. ప్రాంతీయ పార్టీలతో కేంద్రం రహస్య సంప్రదింపులు!

డీలిమిటేషన్ బిల్లుపై కేంద్రం మరోసారి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం

2029 ఎన్నికల లోపే పూర్తి చేయాలని యోచన

ప్రాంతీయ పార్టీలతో కేంద్రం సంప్రదింపులు

గతంలోని వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి అడుగులు

ఏకాభిప్రాయం కోసం ముందస్తు చర్చలు



ఢిల్లీ

2

# నేడు సైకిలెక్కనున్న సీఎం చంద్రబాబు..

### రాష్ట్రవ్యాప్త కార్యక్రమానికి విశాఖ నుంచి శ్రీకారం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా టీడీపీ సైకిల్ యాత్ర

విశాఖలో సైకిల్ యాత్రలో పాల్గొననున్న సీఎం చంద్రబాబు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని చాటడమే లక్ష్యం

ఇంధన సంక్షోభం దృష్ట్యా సైకిల్ వాడకం పెంచాలని పిలుపు

'నా దేశం - నా బాధ్యత'గా ఇంధనం తగ్గించాలని సూచన

విశాఖ

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ ఒక మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు  (జూన్ 5) రాష్ట్రవ్యాప్తంగా 'సైకిల్ యాత్ర' నిర్వహించనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు విశాఖపట్నంలో హెలిప్యాడ్ నుంచి తన విడిది కేంద్రం వరకు సైకిల్‌పై ప్రయాణిస్తారని

2




## ఆకాశమే హద్దుగా హైదరాబాద్.. దక్షిణ భారత స్కైస్క్రేపర్ రాజధానిగా భాగ్యనగరం!

ఆకాశహర్మ్యాల నిర్మాణంలో దూసుకెళ్తున్న హైదరాబాద్

దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఎత్తైన భవనంగా నిలిచిన కోకాపేట 'శాస్ క్రౌన్'

భారీగా పెరిగిన నిర్మాణ అనుమతులు

ప్రభుత్వ విధానాలు, పెరిగిన భూముల ధరలే ఈ ట్రెండ్‌కు ప్రధాన కారణం

విపరీతంగా పెరిగిన ఫ్లాట్ల ధరలు, నిర్వహణ ఛార్జీలతో కొనుగోలుదారులపై భారం

హైదరాబాద్

ఒకప్పుడు చారిత్రక కట్టడాలకు, విశాలమైన భూభాగాలకు ప్రతీకగా నిలిచిన హైదరాబాద్ మహానగరం, ఇప్పుడు తన రూపురేఖలను పూర్తిగా మార్చుకుంటోంది. దేశంలోని ఇతర మహానగరాలకు దీటుగా, ఆకాశాన్ని తాకే భవనాలతో సరికొత్తగా ఆవిష్కృతమవుతోంది. ముఖ్యంగా నగరం యొక్క పశ్చిమ కారిడార్‌లో నిర్మాణ రంగం అపూర్వమైన రీతిలో నిలువుగా విస్తరిస్తోంది. దీంతో, హైదరాబాద్ ఇప్పుడు 'దక్షిణ భారతదేశపు స్కైస్క్రేపర్ రాజధాని'గా వేగంగా రూపాంతరం చెందుతోంది.



2

రికార్డులు తిరగరాస్తున్న నిర్మాణాలు

2026 నాటికి, హైదరాబాద్‌లో 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న 275 భవనాలు, 150 మీటర్లు దాటిన 50కి పైగా ఆకాశహర్మ్యాలు ఉండటం ఈ వృద్ధికి నిదర్శనం. ప్రస్తుతం కోకాపేటలో నిర్మించిన 'శాస్ క్రౌన్' (ూూూ జతీశీషఅ),

## విదేశీయుల వివరాలు 24 గంటల్లో ఇవ్వాలి: హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక

హైదరాబాద్‌లో బస చేసే విదేశీయుల వివరాలు 24 గంటల్లో సమర్పించాలి

ఇమ్మిగ్రేషన్ చట్టం 2025 ప్రకారం పోలీసుల తాజా అడ్వైజరీ

నిబంధనలు పాటించని యజమానులు, విద్యాసంస్థలపై కఠిన చర్యలు

విదేశీయుల కదలికలపై నిఘా పెంచడమే లక్ష్యమన్న పోలీసులు

హోటళ్లు, హాస్టళ్లు, ఇంటి యజమానులందరికీ ఈ నిబంధన వర్తింపు

హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో బస చేసే విదేశీయుల వివరాలను 24 గంటల్లోగా తమకు తెలియజేయాలని నగర పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025 ప్రకారం యజమానులకు, విద్యాసంస్థలకు తాజా అడ్వైజరీ జారీ చేశారు. నిబంధనలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

HYDERABAD CITY POLICE

2

గోల్కొండ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) జూన్ 3న ఈ సూచనలు జారీ చేశారు. హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, అద్దె ఇళ్ల యజమానులు, ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సహా విదేశీయులకు ఆశ్రయం కల్పించే వారందరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

విదేశీ పాస్‌పోర్ట్ హోల్డర్లు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు ఉన్నవారు, నేపాల్ జాతీయులతో సహా ఏ విదేశీయుడు తమ ప్రాంగణంలో బస చేసినా, నిర్దేశిత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫారం-××× (ఫారం-సి) సమర్పించాలి.

# సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం

దాదాపు 35కు పైగా కీలక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను సమగ్రంగా వివరించారు.

అమరావతికి ఐకానిక్‌గా 'అమరావతి ఐ'

లండన్, దుబాయ్ నగరాల్లోని ఐకానిక్ నిర్మానాల తరహాలో, కృష్ణా నది ఒడ్డున ఆరు ఎకరాల విస్తీర్ణంలో 'అమరావతి ఐ' నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (ఐదీఖీూ) పద్ధతిలో 30 ఏళ్ల లీజు ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. దీనికోసం టెండర్లు ఆహ్వానించేందుకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా అమరావతి, కృష్ణా నది అందాలను పర్యాటకులు వీక్షించేందుకు వీలు కలుగుతుందని, ఇది ప్రపంచ పర్యాటక పటంలో అమరావతికి ప్రత్యేక స్థానం కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

రాజధాని నిర్మాణ పనులకు ఊతం

అమరావతిలో నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కేబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. హైకోర్టు భవనం బాహ్య సుందరీకరణ పనుల కోసం రూ. 547 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. అదేవిధంగా, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాస భవనాల్లో హోమ్ ఆటోమేషన్, ఇతర ఆధునిక సౌకర్యాల కల్పన కోసం రూ. 94.90 కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. రాజధానిలో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం కోసం ఏపీఐఐసీకి ఎనిమిది ఎకరాల భూమి కేటాయింపును నిర్ధారించారు. రానున్న 9-10 నెలల్లో దీని నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

గ్రామీణ ఉపాధికి 125 రోజుల గ్యారెంటీ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్' (ఎదీ+-=ూహీూజీ×) పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జూలై 1, 2026 నుంచి ఈ పథకం అమలులోకి వస్తుంది. దీని కింద ప్రస్తుతం ఉన్న 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకు పెంచారు. దీనివల్ల ప్రతి గ్రామీణ కుటుంబానికి అదనంగా ఏటా రూ. 7,675 లబ్ధి చేకూరుతుంది. ఈ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తాయి. అంతేకాకుండా, కూలీలకు 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని, ఆలస్యమైతే రోజుకు 0.05% చొప్పున వడ్డీ చెల్లించాలని నిబంధన విధించడం గమనార్హం.

కొత్త పాలసీలతో ప్రగతి పథం

విమానయాన పాలసీ: రాష్ట్ర విమానయాన రంగంలో భారీ లక్ష్యాలతో కొత్త పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. 2035 నాటికి ప్యాసింజర్ మార్కెట్ షేర్‌ను 4 శాతానికి, ఎయిర్ కార్గో మార్కెట్ షేర్‌ను 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త విమానాశ్రయాలు, వాటర్ డ్రోమ్‌ల ఏర్పాటు, ఏరోస్పేస్ తయారీలో పెట్టుబడులను ఆకర్షించడం ఈ పాలసీ ముఖ్య ఉద్దేశాలు.

బీచ్ షాక్ పాలసీ: రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు గోవా, ఒరిస్సా తరహాలో బీచ్ షాక్‌ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పైలట్ ప్రాజెక్ట్‌గా తొలి దశలో చీరాలలోని సూర్యలంక, విశాఖపట్నం బీచ్‌లలో రెండేసి చొప్పున షాక్‌లను ఏర్పాటు చేస్తారు.

అవయవదాన చట్టం: అవయవదానం, అవయవ మార్పిడి కార్యకలాపాలను నియంత్రించేందుకు కేంద్రం తీసుకొచ్చిన 'ది ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ యాక్ట్-2011'ను రాష్ట్రంలో అమలు చేసేందుకు కేబినెట్ నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు, అవయవాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ చట్టాన్ని ఆర్డినెన్స్ రూపంలో తీసుకురానున్నారు.

వ్యవసాయం, పరిశ్రమలకు చేయూత

పోలవరం ఎడమ ప్రధాన కాలువ ప్యాకేజీ 5, 5ూ పనులకు సంబంధించి అంచనా వ్యయాన్ని రూ. 352.6 కోట్ల నుంచి రూ. 796.66 కోట్లకు సవరిస్తూ కేబినెట్ పరిపాలన అనుమతులు ఇచ్చింది. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టుకు 21 పోస్టులను మంజూరు చేసింది. ఈ కేసుల పరిష్కారానికి మంత్రులతో ఒక సబ్ కమిటీని కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం నెడ్‌క్యాప్ ద్వారా పలు కంపెనీలకు భూములు లీజుకు ఇచ్చే ప్రతిపాదనలకు కూడా ఆమోదం లభించింది.

ఇతర కీలక నిర్ణయాలు

శ్రీ సిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ: తిరుపతి జిల్లా శ్రీ సిటీలో కొత్త ప్రైవేట్ యూనివర్సిటీ ఏర్పాటుకు వీలుగా ఏపీ ప్రైవేట్ యూనివర్సిటీ యాక్ట్-2016 సవరణకు ఆర్డినెన్స్ జారీకి ఆమోదం.

అంతర్జాతీయ యోగా దినోత్సవం: జూన్ 7 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు రూ.10 కోట్లు మంజూరు.

భూముల రీ-క్లాసిఫికేషన్: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు గ్రామంలోని 25 ఎకరాల 'ట్యాంక్ పోరంబోకు' భూమిని 'గ్రామ కంఠం'గా మార్చేందుకు నిర్ణయం. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.

టీడీపీ కార్యాలయాలకు భూమి: అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ కార్యాలయాల నిర్మాణానికి 66 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూమి కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

మొత్తంమీద, ఈ కేబినెట్ సమావేశం రాజధాని అమరావతి నిర్మాణాన్ని పరుగులు పెట్టించడం, పర్యాటక రంగానికి కొత్త ఊపునివ్వడం, గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడం, పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడం వంటి బహుముఖ లక్ష్యాలతో సాగింది. ఈ నిర్ణయాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రగతిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.

## అమరావతిపై జగన్ వ్యాఖ్యలు నవ్వొచ్చేలా ఉన్నాయి: మంత్రి నారాయణ

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విషయంలో వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతి ప్రాంతంలో రైతుల మధ్య విభేదాలు సృష్టించి, రాజధాని ప్రాంతాన్ని అస్థిరపరచాలని వైసీపీ కుట్రలు చేస్తోందని ఆయన ఆరోపించారు.

అమరావతిలో పర్యటించిన మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. "వైసీపీ కావాలనే రైతులను రెచ్చగొడుతూ గొడవలు పెట్టాలని చూస్తోంది. ఇప్పుడు అమరావతిపై కమిటీలు వేస్తామనడం నవ్వొచ్చేలా ఉంది. ఒక మాజీ ముఖ్యమంత్రిగా జగన్ క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలి" అని హితవు పలికారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే రోడ్లు, వంతెనలు, భవనాలు, పైప్‌లైన్ల నిర్మాణం జరిగిపోయిన తర్వాత.. మళ్లీ రైతులకు భూములు తిరిగి ఇచ్చేస్తామంటూ వైసీపీ చెప్తున్న మాటల్లో ప్రాక్టికాలిటీ ఎక్కడుందని ఆయన ప్రశ్నించారు.  రాజధాని ప్రాంతంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో మంత్రి పరిశీలించారు. కొండవీటి వాగు అభివృద్ధి పనులతో పాటు.. చీ9, చీ8, చీ7 రోడ్లపై ఈ వాగుపై నిర్మిస్తున్న ప్రధాన వంతెనల ప్రగతిని ఆయన సమీక్షించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, వంతెనల కింద నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డుకువలు లేకుండా నిలిచిపోయిన మట్టిని తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అలాగే అవసరమైన చోట్ల కొండవీటి వాగును మరింత వెడల్పు చేయాలని చెప్పారు. వీటితో పాటు నీరుకొండ వద్ద నిర్మిస్తున్న జలాశయం పనులను కూడా ఆయన పరిశీలించారు. భారీ వర్షాల వల్ల ఎలాంటి సవాళ్లు ఎదురైనా తట్టుకునేలా, నిర్దేశిత గడువులోగా రాజధాని పనులన్నింటినీ పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## కేరళను తాకిన రుతుపవనాలు

కేరళ

దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు కేరళ తీరాన్ని తాకాయి. ఈ విషయాన్ని భారత వాతావరణ శాఖ గురువారం అధికారికంగా ప్రకటించింది. సాధారణంగా జూన్ 1వ తేదీన రావాల్సిన రుతుపవనాలు, ఈసారి మూడు రోజులు ఆలస్యంగా వచ్చాయి. కేరళ తీరంలో వాతావరణం అనుకూలంగా మారడంతో ఇవి దేశంలోకి ప్రవేశించినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. నాలుగు నెలల పాటు సాగే వర్షాకాలానికి ఇది ఆరంభం అని చెప్పవచ్చు. ఈ వార్తతో దేశంలోని రైతులు, మార్కెట్ వర్గాలు, ఆర్థిక నిపుణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

భారత్‌లో వ్యవసాయ రంగం ఎక్కువగా వర్షాలపైనే ఆధారపడి సాగుతోంది. మొత్తం సాగవుతున్న భూమిలో దాదాపు 51 శాతం ప్రాంతానికి ఈ రుతుపవన వర్షాలే ప్రధాన ఆధారం. కోట్లాది మంది ప్రజల జీవనోపాధి, గ్రామీణ ప్రాంతాల ఆదాయం ఈ వానలపైనే ఆధారపడి ఉన్నాయి. రుతుపవనాలు సకాలంలో వస్తేనే పంటల దిగుబడి పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో ఉంటాయి. వర్షాల వల్ల గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, దేశ ఆర్థిక వృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని నిపుణులు  భావిస్తున్నారు.

కేరళను తాకిన ఈ రుతుపవనాలు రాబోయే రోజుల్లో దశలవారీగా దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరిస్తాయి. జులై మధ్య నాటికి దేశం మొత్తాన్ని కమ్ముకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. రాబోయే కొన్ని వారాల పాటు ఇవి ఎంత వేగంగా ముందుకు సాగుతాయనేది చాలా కీలకంగా మారనుంది.

## మళ్లీ డీలిమిటేషన్ బిల్లు.. ప్రాంతీయ పార్టీలతో కేంద్రం రహస్య సంప్రదింపులు!

నియోజకవర్గాల పునర్విభజన బిల్లును మరోసారి తెచ్చే యోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికల కంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి కసరత్తు చేస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఇది సున్నితమైన అంశం కావడంతో ఎలాంటి వివాదాలకు తావులేకుండా రాజకీయంగా ఏకాభిప్రాయం సాధించాలని ప్రభుత్వం యత్నిస్తున్నట్లు సదరు వర్గాలు వెల్లడించాయి.

ఈ సంప్రదింపుల్లో భాగంగా కేంద్రం ఇప్పటికే తమిళనాడుకు చెందిన డీఎంకేతో పాటు పలు కీలక ప్రాంతీయ పార్టీలతో ప్రాథమిక చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్య 1971 జనాభా లెక్కల ఆధారంగానే చేసి ఉంది. ఆ గడువు ముగియనుండటంతో కొత్తగా పునర్విభజన చేపడితే జనాభా ఎక్కువగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లు పెరిగి, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా నష్టపోతాయనే తీవ్ర ఆందోళనలు ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ఫార్ములాను రూపొందించేందుకు కేంద్రం యత్నిస్తోందని సమాచారం.

నిజానికి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పార్లమెంటు ముందుకు తీసుకువచ్చింది. అయితే ఆ సమయంలో ప్రాంతీయ పార్టీల నుంచి, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఫలితంగా ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమై పార్లమెంటులో వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు వీగిపోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకునే.. ఈసారి బిల్లును నేరుగా సభలో పెట్టకుండా, ముందుగానే విస్తృత అవగాహన కుదిరిన తర్వాతే తదుపరి అడుగు వేయాలని కేంద్రం భావిస్తోందని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తోంది.

## ఆకాశమే హద్దుగా హైదరాబాద్.. దక్షిణ భారత స్కైస్క్రేపర్ రాజధానిగా భాగ్యనగరం!

235.3 మీటర్ల ఎత్తు (58 అంతస్తులు)తో దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఎత్తైన పూర్తిస్థాయి నివాస భవనంగా రికార్డు సృష్టించింది. ఈ రికార్డును సైతం అధిగమించేలా, పుప్పాలగూడలో దాదాపు 244 మీటర్ల ఎత్తుతో 'క్యాండ్యూర్ స్కైలైన్' (ఝుఅఎవబతీ ూఎశ్రీఱఅవ) నిర్మాణం జరుగుతోంది. ఇది పూర్తయితే నగరంలో మరో కొత్త అధ్యాయం మొదలవుతుంది.

వీటితో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని డైమండ్ టవర్ (187 మీటర్లు), మైస్కేప్ యూ రెసిడెన్సెస్ (201 మీటర్లు), డీఎస్ఆర్ ది ట్విన్స్, రాఘవ ఐరిస్, ఫీనిక్స్ ట్రైటాన్ వంటి అనేక ప్రాజెక్టులు హైదరాబాద్ స్కైలైన్‌ను పునర్ నిర్వచిస్తున్నాయి. కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపోలిస్, తెల్లాపూర్, పుప్పాలగూడ వంటి ప్రాంతాలు ఈ భారీ నిర్మాణాలకు కేంద్ర బిందువులుగా మారాయి.

నిలువుగా ఎదగడానికి కారణాలివే!

హైదరాబాద్‌లో ఈ ఆకాశహర్మ్యాల సంస్కృతి పెరగడానికి అనేక కారణాలున్నాయి.

1.ప్రభుత్వ విధానాలు: 2014 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సరళీకృత విధానాలు, ముఖ్యంగా ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఖీూ×) పై ఎటువంటి పరిమితులు విధించకపోవడం డెవలపర్లకు వరంలా మారింది. టీఎస్-బీపాస్ ద్వారా నిర్మాణ అనుమతులు వేగంగా లభించడం కూడా ఈ వృద్ధికి ఊతమిచ్చింది.

2.భూముల ధరలు: పశ్చిమ హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్నంటడంతో, తక్కువ స్థలంలో ఎక్కువ నిర్మాణాలు చేపట్టడం ద్వారా ప్రాజెక్టులను లాభసాటిగా మార్చుకోవడానికి బిల్డర్లు ఎత్తైన భవనాల వైపు మొగ్గుచూపుతున్నారు.

3.ఐటీ బూమ్: ఐటీ రంగం విస్తరణ, ఇతర రాష్ట్రాల నుంచి వృత్తి నిపుణుల వలసలు పెరగడంతో ప్రీమియం, విలాసవంతమైన ఇళ్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది.

పెరుగుతున్న అనుమతులు, భవిష్యత్ అంచనాలు

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (+ఎవీజ), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎవీణూ) పరిధిలో 2025లో సుమారు 200 భారీ భవనాలకు అనుమతులు లభించాయి. ఇది 2024తో

## నేడు సైకిలెక్కనున్న సీఎం చంద్రబాబు..

ఆయన తెలిపారు.

గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడారు. "ప్రపంచం నేడు వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. పర్యావరణాన్ని కాపాడటం కేవలం ప్రభుత్వాల బాధ్యతే కాదు, ఇందులో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరం. ఈ ఆలోచనతోనే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు టీడీపీ సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టింది" అని ఆయన వివరించారు.

సైకిల్ వినియోగం వల్ల కాలుష్యం, ఇంధన వినియోగం తగ్గడమే కాకుండా ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పల్లా పేర్కొన్నారు. చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయని, రేపు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తమ రోజువారీ కార్యక్రమాలకు సైకిళ్లను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా మన దేశంలో ఇంధన సంక్షోభం ఏర్పడిందని, అందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన "నా దేశం - నా బాధ్యత" నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పల్లా సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంధన వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించుకోవడం ద్వారా ఇంధన సంక్షోభాన్ని, వాతావరణ కాలుష్యాన్ని అధిగమించవచ్చన్నారు. ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకునే ఈసారి మహానాడు కార్యక్రమాన్ని హైబ్రిడ్ విధానంలో నిర్వహించామని, సుమారు 24 లక్షల మంది కార్యకర్తలు డిజిటల్ వేదికగా హాజరై విజయవంతం చేశారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో పార్టీ శ్రేణులు, ప్రజలు సైకిల్ యాత్రలో భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు 'నేను సైతం' అంటూ ముందుకు రావాలని కోరారు.

## విదేశీయుల వివరాలు 24 గంటల్లో ఇవ్వాలి: హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక

విద్యాసంస్థలు విదేశీ విద్యార్థుల వివరాలను ఫారం-××లో నమోదు చేయాలి. వారు తిరిగి వెళ్లిన వివరాలను కూడా రిపోర్ట్ చేసి, ఆ రికార్డులను కనీసం ఏడాది పాటు భద్రపరచుకోవాలి.

2025 సెప్టెంబర్‌లో అమల్లోకి వచ్చిన కొత్త ఇమ్మిగ్రేషన్ చట్టం అమలులో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు పోలీసులు తెలిపారు. దేశంలో విదేశీయుల కదలికలపై పర్యవేక్షణను పటిష్టం చేయడమే దీని లక్ష్యం. తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా వాస్తవాలను దాచిపెట్టినా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. ఎలాంటి చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు అందరూ ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పోలీసులు కోరారు.

## సినిమా

# వర్షంతో పాటు మా ఇంటికి దేవి వచ్చింది: తమన్నా ఎమోషనల్ పోస్ట్

ముంబైలోని తన ఇంట్లో లింగ భైరవి దేవి పుణ్య పూజ నిర్వహించిన తమన్నా
పూజ రోజున ముంబైలో వర్షం పడటం దైవ సంకేతంగా భావిస్తున్నానని వెల్లడి
వర్షంతో పాటే దేవి తన ఇంటికి వచ్చిందని నమ్మానంటూ భావోద్వేగ పోస్ట్
పూజ ముగిసినా ఇంట్లో దైవిక శక్తి నిలిచిపోయినట్టు అనిపించిందని వ్యాఖ్య

ప్రముఖ సినీ నటి తమన్నా భాటియా తన ఇంట్లో జరిగిన ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం గురించి, దాని వెనుక ఉన్న తన అనుభూతిని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ముంబైలోని తన నివాసంలో లింగ భైరవి దేవి పుణ్య పూజను నిర్వహించగా, ఆ రోజు జరిగిన



ఓ సంఘటనను దైవ సంకేతంగా ఆమె అభివర్ణించారు.

వివరాల్లోకి వెళితే, పూజకు ముందు ముంబైలో భరించలేని వేడి వాతావరణం ఉందని, పూజకు వచ్చిన అతిథులు ఇబ్బంది పడతారేమోనని తాను ఆందోళన చెందానని తమన్నా తన పోస్టులో తెలిపారు. అయితే, పూజ జరిగే రోజు ఉదయం నిద్రలేచి చూడగా, అనూహ్యంగా వర్షం కురిసిందని, వాతావరణం ఒక్కసారిగా చల్లబడిందని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "చెట్లు గాలికి ఊగుతున్నాయి, పువ్వులు వర్షంలో తడిసి ముద్దయ్యాయి. కొన్ని రోజులుగా నగరాన్ని కమ్మేసిన వేడి మాయమైంది. పూజ గంటల తర్వాత మొదలైనా, వర్షంతో పాటే దేవి మా ఇంటికి వచ్చిందనిపించింది" అని తమన్నా రాసుకొచ్చారు.

పూజ పూర్తయి, అందరూ వెళ్లిపోయిన తర్వాత కూడా ఆ ఇంట్లో ఏదో దైవిక శక్తి నిలిచిపోయినట్లు తనకు అనిపించిందని ఆమె పేర్కొన్నారు. "జపం ముగిసింది, పూజ పూర్తయింది. అయినా నేను దేవి పక్కనే కూర్చుండిపోయాను. ప్రార్థన, వేడుక, నవ్వులు, భక్తితో నిండిన ఆ ఇంటిలో ఇంకా ఏదో అందమైన అనుభూతి గాలిలో నిలిచిపోయినట్టు అనిపించింది" అని తమన్నా తన భావాలను వివరించారు. ఈ ప్రత్యేకమైన రోజును కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి జరుపుకోవడం మరింత ఆనందాన్నిచ్చిందని ఆమె తెలిపారు

# కొంగ సింగిలో పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన తాసిల్దార్

గొలుగొండ అనకాపల్లి జిల్లా ,(కింగ్ )



గొలుగొండ మండలం కొంగ సింగి గ్రామంలో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తాసిల్దార్ కాకర నూకరాజు రైతులకు భూ హక్కుల పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా తాసిల్దార్ కాకర నూకరాజు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం పారదర్శక రెవెన్యూ సేవలు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు రైతులు పత్రాలు సక్రమంగా భద్రపరుచుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' అనే పోస్టర్ ఆవిష్కరించిన పాచిపెంట మండల వైఎస్సార్సీపీ నాయకులు.

## కూటమి పార్టీల మ్యానిఫెస్టో కాపీలు, పత్రికా ప్రకటనల కాపీలు దహనం చేసిన వైఎస్సార్సీపీ నాయకులు.

సాలూరు',(కింగ్ )





వైఎస్సార్సీపీ పార్టీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్. జగన్మోహన్ రెడ్డి. ఆదేశాలు మేరకు గురువారం నాడు పాచిపెంట మండల కేంద్రంలో ఉన్న మహాత్మా గాంధీ గారి విగ్రహం వద్ద చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' పోస్టరును పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించి, నిరసన కార్యక్రమం చేపట్టినట్లు పాచిపెంట మండల వైఎస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు గొట్టాపు.ముత్యాలునాయుడు &ఎంపీపీ. బి. ప్రమీల. గురువారం నాడు తెలిపారు.అనంతరం సీఎం నారా చంద్రబాబు పొడిచిన వెన్నుపోటును ప్రజలకు గుర్తు చేస్తూ ఎన్నికల ప్రచారాల్లో కూటమి నాయకులు ఇచ్చిన ఎన్నికల మ్యానిఫెస్టో కాపీలు, బాండ్లు, పత్రికా ప్రకటన కాపీలను పార్టీ శ్రేణులతో కలిసి దహనం చేసినట్లు పార్టీ అధ్యక్షులు గొట్టాపు ముత్యాలునాయుడు & ఎంపీపీ ప్రమీల & ఎంపీటీసీ దండి కొండలరావు. తెలిపారు. ఎన్నికల్లో నారా చంద్రబాబు ఇచ్చిన ఏ హామీలు కూడా పూర్తి స్థాయిలో సక్రమంగా అమలు చేయకుండా మహిళలకు, విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు, రైతులకు, ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచారాని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాచిపెంట మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్లు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి పార్టీ కమిటీలలో ఉన్న అధ్యక్షులు, పార్టీ కమిటీల సభ్యులు, పార్టీలోని ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఏనుగుల గుంపు బీభత్సంతో భయపడుతున్న పురగానివలస.

## తోటలపై దండెత్తిన గజరాజుల గుంపు ప్రాణభయంతో గ్రామస్తులు.

సాలూరు,(కింగ్ )





పార్వతీపురం మన్యం జిల్లా,కొమరాడ.జీయమ్మవలస కురుపాం నియోజకవర్గం లో తిష్ట వేసిన ఈ ఏనుగుల గుంపు పార్వతీపురం మండలం పెద్ద బొండపల్లి. తాళ్లబురిడీ. బందలప్పి. జమదాల.పంట పొలాలు నుండి మక్కువ మండలం.గోపాలపురం.దబ్బగెడ్డ కొన.మార్కొండపుట్టి గైశాల నుండి సాలూరు మండలం, మావుడి పంచాయతీ పరిధిలోని పురగానివలస గ్రామంలో ప్రవేశించి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించడంతో స్థానిక రైతులు,గ్రామస్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గురువారం అడవుల నుంచి గ్రామ సమీప ప్రాంతాలకు చేరుకుంటున్న ఏనుగుల గుంపు తోటలపై దాడులు చేస్తూ పంటలను ధ్వంసం చేస్తోంది. గ్రామ శివార్లలోని. అరటి,జీడి, మామిడి. పామ్ ఆయిల్ తదితర తోటల్లోకి చొరబడిన ఏనుగులు భారీగా నష్టం కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే లక్షల రూపాయల విలువైన పంటలు. వ్యవసాయ మోటార్ పరికరాలు. ధ్వంసం అయ్యాయని ఇంకా ఎప్పుడు ఏ తోటపై దాడి చేస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని ఈ ఏనుగుల గుంపు రాకతో ప్రశాంతంగా ఉండే సాలూరు నియోజకవర్గం కూడా కురుపాం నియోజకవర్గం లా తయారవుతుందేమోనని.గిరిజన ప్రజలు భయపడుతున్నారు.అంతేకాకుండా,ఏనుగుల గుంపు గ్రామాలకు సమీపంలో సంచరిస్తుండటంతో మనుషులపై దాడులు చేసే ప్రమాదం ఉందన్న భయంతో గ్రామస్తులు రాత్రిళ్ల నిద్రలేని పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందేమోనని.చిన్నారులు, మహిళలు,వృద్ధులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. ప్రత్యేక చొరవ తీసుకొని అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఏనుగులను జనావాసాలకు దూరంగా తరలించడంతో పాటు, రైతులకు జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని. గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గజరాజుల సంచారంతో పురగానివలస గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. పరిస్థితి మరింత విషమించకముందే డిప్యూటీ సీఎం. స్థానిక మంత్రి సంధ్యారాణి. అటవీ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

# బెంగళూరులోని అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన.

## మిట్స్ యూనివర్సిటీ కి చెందిన ఎంబీఏ విద్యార్థులు..

## వివరాలు తెలియజేసిన వైస్ ఛాన్సులర్ డాక్టర్ సి యువరాజ్..

మదనపల్లి



మదనపల్లి సమీపంలో గల మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీకి చెందిన ఎంబీఏ విద్యార్థులు పారిశ్రామిక పర్యటనలో భాగంగా బెంగళూరులోని అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించినట్లు వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పారిశ్రామిక నిర్వహణ, సరఫరా గొలుసు నిర్వహణ , సామాజిక బాధ్యత వంటి అంశాలపై ప్రత్యక్ష అవగాహన పొందారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా ప్రతిరోజూ వేలాది మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భారీ ఎత్తున పోషకాహార భోజనాన్ని ఎలా తయారు చేస్తారో, అలాగే సమర్థవంతమైన సరఫరా గొలుసు నిర్వహణ ద్వారా నిర్ణీత సమయంలో ఎలా పంపిణీ చేస్తారో విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించారు. అదేవిధంగా, ఇస్కాన్ కాంప్లెక్స్, వసంతపుర ప్రాంతాల్లో ఉన్న అత్యాధునిక స్వయంచాలక వంటశాలల పనితీరును సందర్శించి వాటి నిర్వహణ విధానాలను అధ్యయనం చేశారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు సేవా సంస్థల నిర్వహణ విధానం, సమాజ సేవలో సంస్థల పాత్ర, జట్టుకృషి ప్రాముఖ్యత, కార్యాచరణ సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు,సామాజిక బాధ్యత వంటి అంశాలపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ఈ పారిశ్రామిక పర్యటనలో డాక్టర్ శిరీష, డాక్టర్ ఎలియ్యల అధ్యాపకుల బృందం, 48 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ గా శ్రీ సందీప్ మాథుర్ బాధ్యతలు స్వీకరణ





విశాఖపట్నం,(కింగ్ )

దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ విశాఖపట్నం ఇచ్ఛాపురం విభాగాన్ని పరిశీలించారు

దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ సందీప్ మాథుర్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం తన తొలి తనిఖీలో భాగంగా నేడు విశాఖపట్నం ఇచ్ఛాపురం రైల్వే విభాగాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు, ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా చర్యలు మరియు నిర్వహణ సామర్థ్యాన్ని సమీక్షించారు.

ఈ తనిఖీ సింహాచలం రైల్వే స్టేషన్‌లో ప్రారంభమైంది. అక్కడ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సందీప్ మాథుర్ పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల మరియు స్టేషన్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపడుతున్న వివిధ పనులను ఆయన సమీక్షించారు.

తనిఖీ సందర్భంగా జనరల్ మేనేజర్ కొత్తవలస, శ్రీకాకుళం రోడ్, నౌపడా, పలాస మరియు ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్లను కూడా సందర్శించారు. ఈ స్టేషన్లలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద కొనసాగుతున్న పునర్వికాస పనులు, ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా చర్యలు మరియు నిర్వహణ మెరుగుదలలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. స్టేషన్‌ల సర్క్యులేటింగ్ ఏరియా, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు (ఖీూదీం), నిరీక్షణ మందిరాలు మరియు ఇతర ప్రయాణికుల సౌకర్యాలను ఆయన పరిశీలించారు. అలాగే సంబంధిత అధికారులతో సమావేశమై వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు.

పనుల నాణ్యతను నిరంతరం కాపాడుతూ, నిర్దేశిత గడువులోపు వాటిని పూర్తి చేయాల్సిన అవసరాన్ని జనరల్ మేనేజర్ నొక్కిచెప్పారు.

అనంతరం జనరల్ మేనేజర్ ఇచ్ఛాపురం నుండి విశాఖపట్నం వరకు విండో ట్రైలింగ్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే పట్టాలు, సిగ్నలింగ్ వ్యవస్థలు, వంతెనలు, వక్ర మార్గాలు (కర్వులు), రోడ్ ఓవర్ బ్రిడ్జిలు (=ూదీం), స్టేషన్ యార్డులు మరియు ఇతర రైల్వే ఆస్తులను పరిశీలించారు. ముఖ్యంగా భద్రతా ప్రమాణాలు మరియు రైళ్ల సమర్థవంతమైన నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు.

ఈ పర్యటన సందర్భంగా వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు మరియు మీడియా ప్రతినిధులు జనరల్ మేనేజర్‌ను కలిసి రైల్వేకు సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అవసరాలపై వినతిపత్రాలు సమర్పించారు. వారి సమస్యలు, సూచనలను సందీప్ మాథుర్ ఓర్పుతో ఆలకించి, సంబంధిత అంశాలను నిబంధనలు మరియు నిర్వహణ సాధ్యతకు అనుగుణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ తనిఖీలో దక్షిణ కోస్తా రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బి.ఎస్.కె. రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ ఓ.బి. సురేష్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ వినీత్ కుమార్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తా మరియు విశాఖపట్నం డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ శ్రీ లలిత్ బోహ్రా పాల్గొన్నారు. వై. బాలాజీ కిరణ్ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి దక్షిణ కోస్తా రైల్వే, విశాఖపట్నం.

# వెండర్ జోన్ కు శంకుస్థాపన

విశాఖపట్నం,(కింగ్ )

ఎండాడ ఆర్.ఆర్.ఆర్. సెంటర్ దగ్గర జీవీఎంసీ స్మార్ట్ వెండింగ్ జోన్ కు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో శ్రీకారం చుట్టిన వెండర్ జోన్ విధానం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఎండాడలో రోడ్డు పక్కన తోపుడు బళ్ల వంటి వ్యాపారుల వల్ల ట్రాఫిక్ కి ఇబ్బంది కలుగుతోందని చెబుతూ వారి జీవనోపాధికి ఇబ్బంది లేకుండా రూ. 1.5 కోట్లతో కంటైనర్ వెండర్ జోన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. 50 నుంచి 70 మందికి వ్యాపారులకు కేటాయించే అవకాశమున్న ఈ జోన్ లో టాయ్ లెట్లు, మంచినీరు, లైట్లు, సీటింగ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, పార్కింగ్ వంటి సౌకర్యాలు సహా సోలార్ పవర్ కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఈఈ శాంతిరాజు, కూటమి నాయకులు చెట్టుపల్లి సన్యాసిరావ, లొడగల అప్పారావు, చెట్టుపల్లి గోపి, దొరబాబు, మంగాదేవి, రవికుమార్, సారిపల్లి శ్రీను, దేవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





# నవీకరించిన పాస్ పుస్తకాల పంపిణీ చేసిన గంటా





విశాఖపట్నం,(కింగ్ )

వైసీపీ హయంలో స్వలాభంతో రెవిన్యూ వ్యవహారాలు అస్తవ్యస్తంగా చేశారని, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ పేరుతో రైతులను భయబ్రాంతులకు గురి చేశారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభం మండలం రేవిడి గ్రామంలో గురువారం పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రూ. 682 కోట్లతో పాస్ పుస్తకాలపైనే కాకుండా సర్వే రాళ్లపై కూడా తన ఫోటోను ముద్రించుకుని జగన్మోహన్ రెడ్డి.. రైతుల భూములపై పెత్తనానికి సిద్ధపడ్డారని విమర్శించారు. 77 లక్షల సర్వే రాళ్లపై జగన్ ఫోటోను తీసేయడానికి కోట్ల రూపాయల ప్రజా ధనం ఖర్చయ్యిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాలపై రాజముద్ర వేసి దశల వారీగా అందించడానికి రూ.22 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. గ్రామ సభల్లో భూ వివరాలు ప్రకటనతో భూ యజమానులు సంతృప్తి చెందితేనే పాస్ బుక్ లు అందజేస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని వెల్లడించారు. మరోవైపు 24 నెలల కాలంలో రూ.24 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లకు దక్కుతుందన్నారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి అనేక ఐటీ ఆధారిత ప్రాజెక్టులు వస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్ కుమార్, గాడు వెంకటప్పుడు, కురుమిన లీలావతి, కాళ్ల సత్యనారాయణ, ఆవాల గంగరాజు, మజ్జి నందీష్, పాండ్రంగి అప్పలనాయుడు, వాల్ల నందిని, నీలాపు సూర్యనారాయణ, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) పై క్షేత్రస్థాయి శ్రేణులకు ప్రభుత్వ విప్ గణబాబు దిశానిర్దేశం

విశాఖపట్నం,(కింగ్ )

రాబోయే ఎన్నికల ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (సర్ ) కార్యక్రమాన్ని పురస్కరించుకుని, నియోజకవర్గంలో నూటికి నూరు శాతం పారదర్శకంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పి.జి.వి.ఆర్. నాయుడు గణబాబు పిలుపునిచ్చారు. గోపాలపట్నంలోని తన కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు, వార్డు అధ్యక్షులు మరియు బూత్ లెవెల్ ఏజెంట్లతో (దీూాం) ఓటర్ల జాబితా వెరిఫికేషన్, కొత్త ఓటర్ల నమోదుపై



ఆయన ఒక ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. రాబోయే రోజుల్లో బూత్ లెవెల్ అధికారులు (దీూాం) నిర్వహించబోయే ఇంటింటి సర్వే సమయంలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు, కొత్తగా నియోజకవర్గానికి వచ్చిన వారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్పించడంతో పాటు, ఓటర్ల కార్డుల్లో ఉన్న తప్పులను సరిచేసేలా చూడాలన్నారు. అలాగే మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారి వివరాలను గుర్తించి, నకిలీ ఓట్లను తొలగించేలా బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూాం) తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి స్థానిక క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో సమన్వయం చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ముఖ్య నేతలు, వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మురికికాల్వల్లో మంచినీటి బోర్లా? డ్రైనేజీ నిర్వహణ తీరు పట్ల గంటా ఫైర్

## త్వరితగతిన భీమిలి రోడ్ల విస్తరణకు ఆదేశం

విశాఖపట్నం,(కింగ్ )

మురికికాల్వల్లో బోర్లు తవ్వి నీరు వినియోగిస్తున్న వారికి భారీ జరిమానాలు విధించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. కలుషితమైన నీటి వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. తగరపువలసలో తీవ్రంగా ఉన్న డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలను గురువారం ఆయన పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీలో సాఫీగా ప్రవహించాల్సిన మురుగు నీటికి అడ్డంగా ఉన్న బోర్లు, మోటార్లు చూసి ఫైర్ అయ్యారు. పాతికేళ్లుగా ఈ బోర్లు వాడకంలో ఉన్నాయని తెలుసుకుని అధికారులు తీరు పట్ల అసహనాన్ని ప్రదర్శించారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలకు జోనల్ కమిషనర్ ఎం.విజయ్ కుమార్ ను ఆదేశించారు. మెయిన్ రోడ్డు పై వ్యాపారాల కారణంగా తగరపువలస జంక్షన్ లో నెలకొంటున్న ట్రాఫిక్ జామ్ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు వచ్చే నెల నుంచి అందుబాటులోకి రానున్న నేపథ్యంలో భీమిలి – తగరపువలస రోడ్డు కీలకం కానుందని, రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన





మొదలు పెట్టాలన్నారు. అలాగే భీమిలి మెయిన్ రోడ్డు, నరసింహస్వామి ఆలయం రోడ్డు, బీచ్ రోడ్డు, గంట స్తంభం – బీచ్ రోడ్డు విస్తరణ ప్రతిపాదనల తక్షణమే కార్యరూపంలోకి తీసుకురావాలని చెప్పారు. భీమిలి అభివృద్ధి కోసం మంత్రి పి.నారాయణ, కమిషనర్ కేతన్ గార్గ్ లతో క్షేత్రస్థాయిలో పర్యటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, ఈఈ వెంకట వాసు, కూటమి నాయకులు గాడు చిన్ని కుమారి లక్ష్మి, తమ్మిన సూరిబాబు, దండి వెంకటేష్, గరే సదానంద, పరిమి భువనేశ్వరి, కొప్పల కృష్ణ, నీలాపు శంకర్ రెడ్డి, దొంతల సూర్య, తదితరులు పాల్గొన్నారు.

# కుటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల విజయవంతమైన పాలన.

కొయ్యూరు ,(కింగ్ )

సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు గౌ కె అచ్చానాయుడు రాష్ట్ర మరియు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మెన్స్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి ఒక్క జిల్లాలో మార్కెట్ యార్డ్ సమస్యలు తెలియపరుస్తూ రైతులకు అనుసంధానంగా వ్యవసాయ పనిముట్లు మరియు సబ్సిడీ ద్వారా ప్రతి ఒక్క రైతుకు అందేలా ప్రోత్సహించాలని వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది ప్రత్యేకంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ మచ్చల మంగతల్లి ఏజెన్సీ గిరిజన అల్లూరి జిల్లాకు ఎక్కువ సబ్సిడీ ద్వారా రైతులకు విత్తనాలు సరఫరా చెయ్యమని వినతిపత్రం ఇవ్వడం జరిగింది





# ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ వెన్నుపోటు పాలనకు రెండేళ్లు

గొలుగొండ ,(కింగ్ )

అనకాపల్లి జిల్లా గొలుగొండ కూటమ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదంటూ గొలుగొండ మండల వైసీపీ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు ముందుగా ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు హామీలను తుంగలో తొక్కి




ప్రజలకు రెండేళ్లుగా వెన్నుపోటు పొడుస్తున్నారని ధ్వజమెత్తారు ఎన్నో బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను . విస్మరించారని ఎద్దేవా చేశారు ఇప్పటికైనా హామీలు అమలు చేసి ప్రజలకు మేలు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి పార్టీ మండల అధ్యక్షులు కొరుప్రోలు పాణి శాంతరావు జిల్లా వైసీపీ మహిళా అధ్యక్షురాలు లోచల సుజాత మాజీ మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ వైస్ ఎంపీపీలు సుర్ల ఆదినారాయణ జక్కు నాగమణి చోద్యం కోపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ కిలపర్తి పెద్దిరాజు మాజీ సర్పంచులు వైసీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# విశాఖ ఆర్డీ కార్యాలయంలో అక్రమాలపై విచారణ జరపాలి




## ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్

నర్సీపట్నం ,(కింగ్ )

ఉమ్మడి విశాఖ జిల్లా ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) కార్యాలయంలో పరిపాలనా లోపాలు, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయంటూ ప్రజా సంకల్ప వేదిక (ఆర్టీఐ) రాష్ట్ర అధ్యక్షుడు జక్కు నరసింహమూర్తి ఆరోపించారు. కోర్టు పరిధిలో కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ కొందరు ఉద్యోగులకు సర్వీసు రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు జారీ చేయడం, అనంతరం వాటిని రద్దు చేస్తూ ఆబేయెన్స్‌లో ఉంచడం వంటి ఘటనలు కార్యాలయ పనితీరుపై అనుమానాలకు తావిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. నగరంలోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగికి సంబంధించిన పదోన్నతి వ్యవహారం న్యాయస్థానంలో విచారణలో ఉండగానే సర్వీసు రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టడం పలు సందేహాలకు దారితీసిందన్నారు. రోస్టర్ పాయింట్ల అమలులో జరిగిన తప్పిదాలపై కొందరు ఉద్యోగులు కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో, కేసు తుది తీర్పు వెలువడకముందే రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు జారీ కావడం వెనుక కారణాలపై విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విషయం వెలుగులోకి రావడంతో ఆ ఉత్తర్వులను రద్దు చేస్తూ ఆబేయెన్స్‌లో ఉంచినట్లు సమాచారం అందిందని తెలిపారు.

ఈ వ్యవహారంలో వాస్తవాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా ఫైళ్లను ముందుకు పంపిన సిబ్బంది పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని నరసింహమూర్తి పేర్కొన్నారు. సంబంధిత అధికారులను తప్పుదోవ పట్టించిన వారిపై శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్న ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతోందన్నారు.


ఇదిలా ఉండగా, జూనియర్ అసిస్టెంట్లను సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియలో అక్రమ వసూళ్లు జరిగాయన్న ఆరోపణలు కూడా ఆరోగ్యశాఖ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారాయని తెలిపారు. పదోన్నతుల కోసం కొందరు ఉద్యోగుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని, వీటిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగికి సంబంధించిన విద్యార్హతల వ్యవహారంపై కూడా అనేక సందేహాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగంలో కొనసాగుతూనే రెగ్యులర్ కోర్సు అభ్యసించారన్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెగ్యులర్ కోర్సు నుంచి డిస్టెన్స్ విధానానికి మార్పు జరిగిందా లేదా అనే అంశాన్ని అధికారులు నిర్ధారించాలని కోరారు. ఆర్డీ కార్యాలయంలో పారదర్శకతకు విఘాతం కలిగించే చర్యలు జరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఉన్నతస్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్ చేశారు.

# కూటమి ప్రభుత్వ హయాంలో చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధి వేగవంతం...

## రూ.30 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు...

**దాతలు, భక్తుల సహకారం మరువలేనిదన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు....**

ఆలమూరు ,(కింగ్ )



చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధి కూటమి ప్రభుత్వ హయాంలో వేగవంతం అయిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. నూకాంబిక అమ్మవారి ఆలయంలో దేవస్థానం నిధులు రూ.30 లక్షలతో చేపట్టిన ప్రదక్షిణ గ్రానైట్ చప్టా నిర్మాణం, క్యూలైన్ మార్గం వద్ద కాంక్రీట్ పనులను ఎమ్మెల్యే బండారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ఆలయానికి తరలివచ్చే భక్తులకు అవసరమైన ప్రతీ సౌకర్యాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతీ శుక్రవారం, అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. దాతలు ముందుకు వస్తే వారి పేరు మీద అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. దాతలు రాని రోజున దేవస్థానం నిధులు వెచ్చించి అన్నదానం చేయడం జరుగుతుందన్నారు. ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరిస్తున్నారని, దాతలు ముందుకు వస్తున్నారని ప్రశంసించారు. ఇప్పటివరకు 48 చండీ హోమాలు జరిగాయని, రాబోయే అమావాస్య రోజు 49వ చండీ హోమం జరుగుతుందన్నారు. 50వ చండీ హోమానికి ప్రత్యేకంగా పూర్తిస్థాయిలో దేవస్థానం యాగశాల నిర్మించి నిర్వహించాలని సూచించారు. సామూహికంగా గాని, వ్యక్తిగతంగా కానీ చండీ హోమం నిర్వహించుకునే భక్తులకు అనుకూలంగా యాగశాల, వసతుల ఏర్పాటు జరగాలన్నారు. ఈ అంశంపై ఈవో, చైర్మన్ లు యాగశాల ఏర్పాటు చేస్తామని తెలిపారన్నారు. ప్రతీ పౌర్ణమికి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించే విధంగా దేవస్థానం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ వీరి అప్పారావు గౌడ్ పాలకమండలి సభ్యులు,ఆకుల రామకృష్ణ,పాలూరి సత్యానందం,ఈదాల సత్తిబాబు మరియు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి రెండేళ్ల పాలన శూన్యం: మేనిఫెస్టో పాంప్లేట్లను దగ్ధం చేసిన వైసీపీ నాయకులు

కొయ్యూరు ,(కింగ్ )

రెండేళ్ల కూటమి పాలనలో ప్రజలకు చేకూరిన లబ్ధి ఏమీ లేదని, ప్రజా సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పాడేరు నియోజకవర్గ ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపు మేరకు గురువారం కొయ్యూరు మండల కేంద్రంలో వైసీపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందంటూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వం విడుదల చేసిన మేనిఫెస్టో పాంప్లేట్లను రోడ్డుపై పెట్టి బహిరంగంగా దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు అబద్ధపు, ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి కూటమి నాయకులు అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. అధికార పీఠం దక్కి రెండేళ్లు గడుస్తున్నా, ఆ హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అసమర్థ పాలన సాగుతోందని, ప్రజలు తమ హక్కుల కోసం రోడ్లపైకి వచ్చే పరిస్థితి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేకనే నాటి ప్రతిపక్షాలు అబద్ధాలతో ప్రజలను వంచించాయని దుయ్యబట్టారు.

ఈ నిరసన కార్యక్రమంలో కొయ్యూరు మండల పరిషత్




అధ్యక్షుడు (ఎంపీపీ) బడుగు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు బిడిజన అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షులు గాడి సత్యనారాయణ, రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ అచ్యుత్, రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి జైతి రాజులమ్మ, రాష్ట్ర ఆర్టీఐ విభాగం కార్యదర్శి నీలపు సూరిబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పొట్టిక పోతురాజు, జిల్లా కార్యదర్శి సుమర్ల సూరిబాబు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ధోని బాబ్జి, జిల్లా గ్రీవెన్స్ సెల్ మాజీ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్,వైస్ ఎంపీపీ అంబటి నూకాలమ్మ,మండల పార్టీ ఉపాధ్యక్షుడు నర్సి కృష్ణ, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు జల్లి బాబులు, మండల కార్యదర్శులు వారా చిన నూకరాజు, కొర్రా తిరుపతి, సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షులు రేగటి ముసలి నాయుడు,మాజీ సర్పంచులు రీమల శ్రీను,కోడా రాజబాబు, పాటి చంద్రశేఖర్, మాజీ ఉప సర్పంచ్ కాళ్ళ వనుంబాబు లతో పాటు నాయకులు, ధూపం శ్రీను,ఉల్లి రామ్మూర్తి, ధూరి గంగరాజు, కొర్రా నారాయణ,శివ వైసీపీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మానవతామూర్తి సీఎం చంద్రబాబు

## సీఎం రిలీఫ్ ఫండ్ తో పేద, మధ్యతరగతి వర్గాలకు ఉపశమనం...

## నాలుగు మండలాలకు చెందిన 100మందికి రూ.55,27,455ల విలువైన చెక్కుల పంపిణీ...

## ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...



రావులపాలెం ,,(కింగ్ )

సీఎం రిలీఫ్ ఫండ్ క్రమం తప్పకుండా అందిస్తూ గొప్ప మానవతావాదిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలుస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుందని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయనిధి అనేది మృగ్యంగా ఉండేదని, ఎవ్వరికీ దొరికేది కాదన్నారు. నేడు పేద ప్రజలకు ఎవరు ఏ విధమైన వైద్యం చేయించుకున్నా, వారికి కష్టాల్లో చేదోడు వాదోడుగా ఉండాలని కనీస సహాయం అందించాలనే దృక్పథంతో ఆర్థిక సహకారాన్ని చెక్కుల రూపంలో అందరికీ అందిస్తున్నామన్నారు. మన నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సీఎం సహాయనిధి అందుతుందన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా చెక్కుల పంపిణీ జరుగుతుందన్నారు.ఇప్పటికే సంక్షేమం పెద్ద ఎత్తున ఈ ప్రభుత్వంలో అందుతుందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ మొదలైన పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అమిత ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అటు ఎన్టీఆర్ ఆరోగ్య సేవ, ఇటు ఇన్సూరెన్స్ కవర్ కాని రోగులకు సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి థాంక్యూ సీఎం సార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండలానికి చెందిన 19 మందికి రూ.7,96,028ల విలువైన చెక్కులను, రావులపాలెం మండలానికి చెందిన 24 మందికి రూ.1,7,56,963ల విలువైన చెక్కులను, కొత్తపేట మండలానికి చెందిన 25మందికి రూ.1,3,47,722ల విలువైన చెక్కులను, ఆలమూరు మండలానికి చెందిన 32మందికి రూ.1,6,26,742 ల విలువైన చెక్కులను మొత్తం నియోజకవర్గానికి సంబంధించి 100 మందికి (93 రీయింబర్స్మెంట్, 7 ఎల్వోసీలు) రూ.55,27,455ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ,పల్లి భీమరావు,కంఠంశెట్టి శ్రీనివాస్,కరుటూరి నరసింహారావు,పాలూరి సత్యానందం,చిలువూరి సతీష్ రాజు,ఈదాల సత్తిబాబు,కొసంపూడి రామకృష్ణరాజు,గనిశెట్టి వీరేష్, కొప్పిశెట్టి ప్రసాద్ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు ఆరోగ్యకర ఓటర్ల జాబితా కీలకం

అర్హులైన ప్రతి ఒక్కరు ఓటర్లుగా తప్పక నమోదు చేయించాలి

ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై రాజకీయ పార్టీలు పూర్తి అవగాహన కలిగి ఉండాలి

పారదర్శకంగా, సమర్థవంతంగా సర్వే నిర్వహణకు రాజకీయ పార్టీల సహకారం అవసరం

జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం ,(కింగ్ )

జిల్లా కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ూ×=) కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితా అత్యంత ముఖ్యమని తెలిపారు. జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లు లేకుండా, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడం మరియు అనర్హులైన పేర్లు తొలగించబడటం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. బూత్ లెవల్ అధికారులు (దీూాలు) తమ విధులను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, 2002 ఓటర్ల జాబితా మరియు 2025 తాజా జాబితాలను ఆధారంగా తీసుకుని మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కనీసం 95 శాతం సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాలని, అవసరమైన ఫారం-6, ఫారం-7, ఫారం-8 తదితర దరఖాస్తు పత్రాలను బిఎల్వోలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా వెయ్యి మంది ఓటర్లకు మాత్రమే పరిమితం ఉండేలా నిబంధనల ప్రకారం హేతుబద్ధీకరణ చేపట్టాలని తెలిపారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా చురుకుగా పాల్గొనాలని కోరారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం షెడ్యూల్‌ను వివరిస్తూ, జూన్ 5 నుండి 14 వరకు శిక్షణ మరియు ప్రింటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని చెప్పారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, జూలై 21 నుండి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్ మరియు అభ్యంతరాల స్వీకరణ జరుగుతుందని తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఓటరు నమోదుకు సంబంధించి అవసరమైన పత్రాలపై కూడా కలెక్టర్ వివరణ ఇచ్చారు. 01.07.1987కు ముందు జన్మించినవారు, 01.07.1987 నుండి 02.12.2004 మధ్య జన్మించినవారు, అలాగే 02.12.2004 తర్వాత జన్మించినవారికి వేర్వేరు ధృవపత్రాలు అవసరమవుతాయని తెలిపారు. జనన ధృవపత్రం, విద్యా ధృవపత్రాలు, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డు, ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపు కార్డులు తదితర పత్రాలను వినియోగించవచ్చన్నారు.




ఇంటింటి సర్వే ద్వారా డూప్లికేట్ ఓటర్లు, మరణించినవారి పేర్లు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను సేకరించి జాబితా శుద్ధి చేపడతామని తెలిపారు. ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న యువత, మహిళలు, దివ్యాంగులు, వలస కార్మికులు వంటి వర్గాల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ డాక్టర్ కె.సి.హెచ్. అప్పారావు, డిపిఓ వై.దోసి రెడ్డి, భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలోని 14 థియేటర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

## జిల్లా రెవెన్యూ అధికారి వి సుబ్బారావు



అమలాపురం ,(కింగ్ )

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సుమారుగా 14 థియేటర్లు రిజిస్ట్రేషన్ చేయించు కోవలసినదని జిల్లా రెవెన్యూ అధికారి వి సుబ్బారావు తెలిపారు గురువారం. రాష్ట్ర రాజధాని నుండి రాష్ట్ర సమాచార పౌర సంబం ధాల శాఖ సంచాలకులు, మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కే ఎస్ విశ్వనాథన్ అన్ని జిల్లాల జాయింట్ జాయింట్ కలెక్టర్లు జిల్లా రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించి ఆంధ్రప్రదేశ్ సినిమా థియేటర్లలో ఆమోదిత చిత్రాల ప్రదర్శనకు సంబంధించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు మరి యు పర్యవేక్షణకు సం బంధిం చిన అంశాలపై సమీక్షించారు . ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ప్రసంగిస్తూ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 14 థియేటర్లు రిజిస్ట్రేషన్ చేయించుకో వలసిందని రిజిస్ట్రేషన్లు చేయించుకునే విధంగా మార్గ నిర్దేశం చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఆయా థియేటర్లో యా జమాన్యాలకు రిజిస్ట్రే షన్ చేయించు కోవాలని నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. రిజిస్ట్రే షన్ పూర్తి చేసి ప్రభుత్వం ఆమోదించిన ఫిలిం డాక్యుమెంట్లను ప్రదర్శించే విధం గా చర్యలు తీసుకుం టామ ని ఆయన సూచించారు జిల్లావ్యాప్తంగా 26 థియే టర్లు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి ఉన్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సెక్షన్ సూ పరింటెండెంట్ రమణకు మారి తదితరులు పాల్గొ న్నారు

# విశాఖ ఆర్డీ కార్యాలయంలో అక్రమాలపై విచారణ జరపాలి

## ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్

నర్సీపట్నం, ,(కింగ్ )

ఉమ్మడి విశాఖ జిల్లా ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ (ఆర్డీ) కార్యాలయంలో పరిపాలనా లోపాలు,




అక్రమాలు చోటుచేసుకుంటున్నాయంటూ ప్రజా సంకల్ప వేదిక (ఆర్టీఐ) రాష్ట్ర అధ్యక్షుడు జక్కు నరసింహమూర్తి ఆరోపించారు. కోర్టు పరిధిలో కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ కొందరు ఉద్యోగులకు సర్వీసు రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు జారీ చేయడం, అనంతరం వాటిని రద్దు చేస్తూ ఆబేయెన్స్‌లో ఉంచడం వంటి ఘటనలు కార్యాలయ పనితీరుపై అనుమానాలకు తావిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. నగరంలోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగికి సంబంధించిన పదోన్నతి వ్యవహారం న్యాయస్థానంలో విచారణలో ఉండగానే సర్వీసు రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టడం పలు సందేహాలకు దారితీసిందన్నారు. రోస్టర్ పాయింట్ల అమలులో జరిగిన తప్పిదాలపై కొందరు ఉద్యోగులు కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో, కేసు తుది తీర్పు వెలువడకముందే రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు జారీ కావడం వెనుక కారణాలపై విచారణ జరపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విషయం వెలుగులోకి రావడంతో ఆ ఉత్తర్వులను రద్దు చేస్తూ ఆబేయెన్స్‌లో ఉంచినట్లు సమాచారం అందిందని తెలిపారు.

ఈ వ్యవహారంలో వాస్తవాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా ఫైళ్లను ముందుకు పంపిన సిబ్బంది పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని నరసింహమూర్తి పేర్కొన్నారు. సంబంధిత అధికారులను తప్పుదోవ పట్టించిన వారిపై శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనే ప్రశ్న ఉద్యోగ వర్గాల్లో వ్యక్తమవుతోందన్నారు.

ఇదిలా ఉండగా, జూనియర్ అసిస్టెంట్లను సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియలో అక్రమ వసూళ్లు జరిగాయన్న ఆరోపణలు కూడా ఆరోగ్యశాఖ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారాయని తెలిపారు. పదోన్నతుల కోసం కొందరు ఉద్యోగుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని, వీటిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ మానసిక ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగికి సంబంధించిన విద్యార్హతల వ్యవహారంపై కూడా అనేక సందేహాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగంలో కొనసాగుతూనే రెగ్యులర్ కోర్సు అభ్యసించారన్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెగ్యులర్ కోర్సు నుంచి డిస్టెన్స్ విధానానికి మార్పు జరిగిందా లేదా అనే అంశాన్ని అధికారులు నిర్ధారించాలని కోరారు. ఆర్డీ కార్యాలయంలో పారదర్శకతకు విఘాతం కలిగించే చర్యలు జరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఉన్నతస్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి డిమాండ్ చేశారు.

# కూటమి ప్రభుత్వం రెండు ఏళ్ళు వెన్నుపోటు

## కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి....

## వైసిపి నాయకుల డిమాండ్...

పాలకొల్లు: ,(కింగ్ )

పాలకొల్లు పట్టణం లో గాంధీ బొమ్మల సెంటర్ లో ఇంఛార్జి గుడాల హరి గోపాల రావు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వానికి వ్యతి రేకంగా వైఎస్ఆర్సీపీ వెన్ను పోటు కు రెండు ఏళ్ళు నిరసన కార్యక్రమం లో ఇంఛార్జి గుడాల శ్రీ హరి గోపాల రావు నియోజక వర్గ పరిశీలకులు పే రిచర్ల నరసింహ రాజు తో కలిసి కార్యక్రమం లో పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావచ్చునా కానీ ఇంతవరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ప్రజలను నిలువునా మోసం చేసిందని వారు అన్నారు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేదంటే ఉద్యమాన్ని ప్రజలతో కలిసి మరింత ఉధృతం చేస్తామని వారి హెచ్చరించారు వెన్నుపోటు రాజకీయాలు టిడిపికి కొత్త కాదని ప్రజలను మరొకమారు వెన్నుపోటు పొడిచారని అమలు కాని హామీలతో ప్రజలను నిలువెల్లా ముంచారని వారు మండిపడ్డారు ఈ కార్యక్రమంలో న్యాయవాది వైఎస్ఆర్సీపీ స్టేట్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయ సరిత. టౌన్ ప్రెసిడెంట్ కోరాడ శ్రీను, మాజీ ఎమ్ ఎల్ సి మేకా శేష బాబు,వైఎస్ఆర్సీపీ నాయకులు, మహిళలు సిడ గం రమణ, గంగి రెడ్ల హైమావతి, రొక్కాల మేరీ,ఆది లక్ష్మీ, పసుపు లేటి కుమారి, తదితరులు పాల్గొన్నారు.




# జూన్ 5న మార్టేరులో "ఒక నెల -ఒక గ్రామం - నాలుగు సందర్శనలు"

## నాలుగవ విడత కార్యక్రమం

## ఉదయం 9.30 గంటల నుంచి ప్రత్యేక పీజీఆర్ఎస్

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం ,(కింగ్ )

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ఒక నెల ▪ ఒక గ్రామం ▪ నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా జూన్ 5న ఆచంట నియోజకవర్గం పెనుమంట్ర మండలం మార్టేరులో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మార్టేరు జడ్పీ స్కూల్ పక్కన ఉన్న వేణుగోపాల స్వామి ఆడిటోరియం నందు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు, వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రతి శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆచంట నియోజకవర్గంలో మే15న తొలి విడత, మే 22న రెండో విడత, మే29న మూడవ విడత కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. జూన్ 5న ఆచంట నియోజకవర్గంలో నాల్గవ విడత కార్యక్రమంతో ఆచంట నియోజకవర్గంలో నాలుగు విడతల పిజిఆర్ఎస్ కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే జిల్లా, డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు ఉదయం 9.00 గంటలకే మార్టేరు గ్రామం వేణుగోపాలస్వామి ఆడిటోరియంకు తప్పనిసరిగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



# ఆళ్లగడ్డలో జూన్ 5న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### "వన్ మంత్ - ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ

నంద్యాల ,(కింగ్ )



''వన్ మంత్ - ఫోర్ విజిట్'' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 5వ తేదీన ఆళ్లగడ్డ నియోజకవర్గంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆళ్లగడ్డ పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతారని కలెక్టర్ తెలిపారు. అలాగే గత మూడు వారాలుగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో స్వీకరించిన వినతులపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలకు సంబంధించిన ఎండార్స్‌మెంట్ కాపీలను అర్జీదారులకు అందజేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఎన్.టి.అర్. షాది ఖానా దుస్థితి చూడండి.

**పెళ్ళిళ్ళకు డబ్బులు వస్తాయి మరమత్తులు నిల్.**

**చెట్లు మొలిచి ఒకవైపు కూలెందుకు సిద్ధంగా ఉన్న షాది ఖానా.**

**షాది ఖానా కమిటీ ఏమి చేస్తుంది.**

నంద్యాల ,(కింగ్ )



నంద్యాల పట్టణం ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఎన్.టి.అర్.షాది ఖానా దుస్థితి దారుణంగా మారింది.ఒకవైపు చెట్లు మొలిచి కూలెందుకు సిద్ధంగా ఉంది.షాది ఖానా కమిటీ ఉన్న ఏమి చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి.వివరాల్లోకి వెళితే మైనార్టీల పెళ్ళిళ్ళకు షాది ఖానా లేకపోవడంతో మైనార్టీలు ఇబ్బంది పడేవారు.తెలుగుదేశం ప్రభుత్వ హయంలో మంత్రిగా ఉన్న ఫరూక్ దృష్టికి వెళ్ళింది.మైనార్టీలు పెళ్ళిళ్ళకు ఇబ్బందులు పడకుండా షాది ఖానా కు నిధులు మంజూరు చేయించి షాది ఖానా ఏర్పాటుచేశారు.షాది ఖానా ఏర్పాటు చేయడంతో మైనార్టీల పెళ్ళిళ్ళ కు ఇబ్బందులు లేకుండా సంతోషంగా సాగేవి.కాలం మారుతున్న విధంగా షాది ఖానా లో పెళ్ళిళ్ళకు వచ్చే రుసుము వస్తున్నా షాది ఖానా కు మరమత్తులు చేయడంలో కమిటీ విఫలం అయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం షాది ఖానా కు ఒక వైపు చెట్లు మొలిచి ఆ ప్రాంతంలో కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది.ఇటీవల మంత్రి ఫరూక్ ఒక సమావేశంలో షాది ఖానా లో పాల్గొని షాది ఖానా దుస్థితి చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు.గోడలకు రంగులు పాలిపోయి,శుభ్రత సరిగా లేదని,గతంలో పెళ్ళిళ్ళ సమయంలో మైనార్టీ మహిళలు పైన కూర్చొని పెళ్ళిళ్ళు చూసేవారన్నారు.ప్రస్తుతం ఎలాంటి మరమ్మతులకు నోచుకోక పోవడంతో పై భాగాన మొక్కలు మొలిచి కూలెందుకు సిద్ధంగా ఉంది.ప్రస్తుతం పెళ్ళిళ్ళు లేకపోవడం విశేషం.ఇప్పటికైనా షాది ఖానా కు మరమత్తులు చేస్తారని ఆశిద్దాం.

# నరసాపురంలో పి ఎం డి ఎస్ షోయింగ్ కార్యక్రమం.

రుద్రవరం.,(కింగ్ )




రుద్రవరం మండలం నరసాపురం గ్రామంలో ఖజూఎఅట క్యాంపెయిన్ లో భాగం గా జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మరియు మండల వ్యవసాయ అధికారినీ ఆధ్వర్యంలో గ్రామం లోని 5 మంది రైతు ల తో 6 ఎకరాల విస్తీర్ణం తో 30 రకాల విత్తనాల తో విత్తన గుళికలు తయారు చేసి పిఎండిఎస్ షోయింగ్ కార్యక్రమం వ్యవసాధికారి సుమతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా నర్సాపురం గ్రామంలో నీ రైతులు ప్రసాద్ 1.00 ఎకరాలు,భాష 1.00 , ఎకరాలు సునీల్ కుమార్ 2.00 , ఎకరాలు, వై శివ 1.00 ఎకరాలు, రుద్రవరం రైతు సూర్య నారాయణ రెడ్డి 1.00 ఎకరాలు మొత్తం 6 ఎకరాల విస్తీర్ణంలో పిఎండిఎస్ సోయింగ్ చేపించడం జరిగింది .ఈ కార్యక్రమంలో డిపిఎం శ్రీనివాసులు, డివిజన్ ఏంటి రామాంజనేయ రెడ్డి సునీల్ కుమార్, శివ శంకర్,గౌరీ, వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు.

# విజయం గమ్యం కాదు.. ఉన్నత లక్ష్యాలకు తొలి అడుగు కలెక్టర్ రాజకుమారి

## సబ్జెక్టుపై పట్టు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతోనే శిఖరాగ్రాలకు చేరుకోవాలి

## ప్రతిభావంతులైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఘన సత్కారం

నంద్యాల ,(కింగ్ )



ఒక విజయం వద్దే ఆగిపోకుండా, దానిని మరిన్ని విజయాలకు పునాదిగా మలుచుకుని ఉన్నత లక్ష్యాల సాధన దిశగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులనుహా ప్రశంసాపత్రాలు, మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించి వారి విజయాన్ని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయాలు కేవలం పరీక్షల ఫలితాలకు మాత్రమే పరిమితం కాకుండా, భవిష్యత్ జీవితానికి బలమైన పునాది కావాలని ఆకాంక్షించారు. గురుకుల విద్యాసంస్థల్లో చదివి పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 12 మంది, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన 13 మంది విద్యార్థులతో పాటు ఏపీ మోడల్ స్కూల్, బీసీ వెల్ఫేర్ విద్యాసంస్థలకు చెందిన మరో ఐదుగురు విద్యార్థులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం విద్యా, ఉద్యోగ రంగాల్లో పోటీ తీవ్ర స్థాయికి చేరుకుందని, కేవలం మార్కులు సాధించడం మాత్రమే కాకుండా సబ్జెక్టుపై లోతైన అవగాహన, విశ్లేషణాత్మక దృష్టి, నిరంతర అధ్యయన తపన అవసరమని పేర్కొన్నారు. బట్టీ పట్టే విధానానికి బదులుగా ప్రతి అంశాన్ని అర్థం చేసుకుంటూ నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రశ్నించే విద్యార్థే నిజమైన విద్యార్థి అవుతాడని, జిజ్ఞాసే విజయానికి మూలమని చెప్పారు. విద్యార్థులు సమాజంలో జరుగుతున్న పరిణామాలు, దేశ-విదేశాల్లో చోటుచేసుకుంటున్న మార్పులపై అవగాహన పెంపొందించుకోవాలని, నిరంతరం తమ జ్ఞానాన్ని నవీకరించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. విద్యలో విజయం సాధించినప్పటికీ వినయాన్ని కోల్పోకూడదని, అపజయాలు ఎదురైనప్పుడు నిరాశ చెందకుండా వాటిని పాఠాలుగా స్వీకరించి మరింత బలంగా ఎదగాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టం, త్యాగాలు విద్యార్థుల విజయాలకు పునాది కావాలని, వారి ఆశయాలను సాకారం చేయాలనే బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. స్వీయ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథం జీవితంలో ఉన్నత శిఖరాలకు చేర్చగలవని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు హాబీలు, క్రీడలు, లైఫ్ స్కిల్స్‌ను అలవర్చుకోవాలని, పుస్తక పఠనం, మొక్కల పెంపకం, ఈత, కరాటే వంటి కార్యకలాపాలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయని వివరించారు.లి లిఅలాగే నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమస్యల పరిష్కార సామర్థ్యం వంటి సాఫ్ట్ స్కిల్స్ ఆధునిక ప్రపంచంలో అత్యంత కీలకమని తెలిపారు. తమతో పాటు వెనుకబడిన సహ విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారికి మార్గదర్శనం చేయడం ద్వారా సామాజిక బాధ్యతను చాటాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వ్యక్తిగత విజయంతో పాటు సమాజాభివృద్ధికి కూడా తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, బాధ్యతాయుత పౌరులుగా ఎదిగి దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయాలను మరింత ఉన్నత లక్ష్యాలకు పునాదిగా మలుచుకుని జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. పిల్లల విజయాల వెనుక తల్లిదండ్రులు అందించిన సహకారం, ఉపాధ్యాయులు అందించిన మార్గదర్శకత్వం అమూల్యమని పేర్కొంటూ వారందరికీ కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# వెన్నుపోటుకు రెండేళ్లు.

## రుద్రవరంలో వైఎస్ఆర్సిపి భారీ నిరసన ర్యాలీ.

రుద్రవరం.,(కింగ్ )





రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినప్పటికీఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందంటూ రుద్రవరంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు నిరసన గళం విప్పారు. వైఎస్ఆర్సిపి అధినేత, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరియు ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి (నాని) ఆదేశాల మేరకు గురువారం ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన ర్యాలీలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు. స్థానిక హైస్కూల్ నుండి అమ్మవారి శాల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, తమ నిరసనను వ్యక్తం చేశారు. "వెన్నుపోటుకు రెండేళ్లు" అంటూ నినాదాలు చేస్తూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మోసపూరితమైన హామీలను నమ్మి ప్రజలు ఓటు వేస్తే, అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ఆ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని గంధం రాఘవరెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల ఆశలను ఆశలను అడియాసలు చేస్తోందని, ఇచ్చిన మాట నిలబెట్టుకోని ప్రభుత్వం కూలిపోక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు ప్రసాద్ రెడ్డి,, టి ఏ నరసింహారావు, హరి నారాయణ, దేగాని వెంకటేష్, జాకీర్ హుస్సేన్, పెద్దన్న,పాణ్యం చంద్ర, సవరం నాగ ముని, మాధవ, జయరాముడు, శూలం ప్రభాకర్, డిష్ భాస్కర్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆకాశమే హద్దుగా అగ్నివీర్ వాయుగా ఎంపికైన రుద్రవరం మోడల్ స్కూల్ విద్యార్థి మహీధర్ యాదవ్.

రుద్రవరం.,(కింగ్ )



ఏపీ మోడల్ స్కూల్, రుద్రవరం విద్యార్థి మహీధర్ యాదవ్ 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఈ విద్యాసంస్థలోనే విద్యను అభ్యసించారు. తన కృషి, పట్టుదల, క్రమశిక్షణ మరియు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో విద్యా రంగంలో విశేష ప్రతిభ కనబరిచి, ప్రస్తుతం అగ్నివీర్ వాయు ద్వారా భారత వైమానిక దళం ఇండియన్ ఆర్మీలోలో ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది.

ఈ సందర్భంగా మహీధర్ యాదవ్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు హృదయపూర్వకంగా అభినందించారు. ఆయన సాధించిన ఈ విజయం పాఠశాలలోని ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహీధర్ యాదవ్ ఈ నెల 25వ తేదీన విధుల్లో చేరనున్నట్లు తెలిపారు. ఆయన దేశ సేవలో అత్యుత్తమంగా రాణించి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాఠశాల కుటుంబం ఆకాంక్షించింది. అలాగే, బి నాగిరెడ్డి పల్లె కి చెందిన మహీధర్ యాదవ్ తల్లిదండ్రులు లింగ మూర్తి , వాణిశ్రీ తమ కుమారుడిని క్రమశిక్షణతో పెంచి, విద్యాభ్యాసంలో ప్రోత్సహించి ఈ విజయానికి బలమైన పునాది వేశారు. వారి సహకారం వల్ల విద్యార్థి మాత్రమే కాకుండా పాఠశాలకు కూడా మంచి గుర్తింపు, గౌరవం లభించిందని ప్రిన్సిపాల్ ప్రశంసించారు.

మహీధర్ యాదవ్ సందేశం:

"నా విజయానికి కారణమైన నా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మరియు ఏపీ మోడల్ స్కూల్ రుద్రవరం కుటుంబానికి, బి.నాగిరెడ్డి పల్లె అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. చిన్నప్పటి నుండి దేశ సేవ చేయాలనే నా కల నేడు అగ్నివీర్ వాయుగా ఎంపిక కావడంతో సాకారమైంది. కష్టపడి లక్ష్యంపై దృష్టి పెడితే ఏదైనా సాధించవచ్చని నేను నమ్ముతున్నాను. నా లాంటి విద్యార్థులందరూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ కలలను నిజం చేసుకోవాలని కోరుకుంటున్నాను. దేశ సేవలో అంకితభావంతో పనిచేసి మా పాఠశాలకు, తల్లిదండ్రులకు, నా గ్రామం బి . నాగిరెడ్డి పల్లె కి, రుద్రవరం మండలం లో ఉన్న అందరికీ
మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తాను.

# దేవాలయ భూములకు కౌలు వేలంపాటలు.

రుద్రవరం. ,(కింగ్ )

మండలంలోని పేరూరు గ్రామంలో దేవాలయ భూములకు కౌలు వేలంపాటలు గురువారం నిర్వహించారు. దేవాలయ ఇన్స్పెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో కార్య నిర్వహణ అధికారి సాయి జయ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈశ్వర స్వామి, రామస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలకు సంబంధించిన భూములకు కౌలు వేలంపాటలు వేలంపాటలు నిర్వహించారు. ఈ వేలం పాటల్లో రూ 6 లక్షల 95 వేల రూపాయల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ వేలం పాటల్లో దేవాదాయ శాఖ సిబ్బంది,ఎస్పై జయప్ప, ఏఎస్ఐ రాంభూపాల్ రెడ్డి,టిడిపి నాయకుడు రామనాథరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.






# ఖాజా పీర్, దాదా పీర్ కుటుంబీకుల వివాహానికి హాజరైన.

## మదనపల్లి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్.

## వైసిపి ముఖ్య నేత నూతన కాలువ శ్రీనాథ్ రెడ్డి.

మదనపల్లి ,(కింగ్ )

మదనపల్లి పట్టణం, చిప్పిలి గ్రామానికి చెందిన ప్రముఖ కూరగాయల మండి వ్యాపారులు ఖాజా పీర్, దాదా పీర్ కుటుంబీకుల వివాహ కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. అంగళ్లు సమీపంలోని ఓ కళ్యాణ మండపంలో ఖాజా పీర్, దాదా పీర్ కుటుంబానికి చెందిన వివాహ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మదనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, వైసిపి ముఖ్యనేత నూతనకాలువ శ్రీనాథ్ రెడ్డి, మదనపల్లి నియోజకవర్గ వైసిపి యూత్ అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి, వైయస్సార్సీపి రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి వి ఎస్ రెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు సిలార్ ఖాన్, మదనపల్లి మండల వైసీపీ బూత్ కమిటీ అధ్యక్షులు, మాజీ సైనికులు చిప్పిలి మల్లికార్జున రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్, తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



ఎంతో వేడుకగా జరిగిన ఈ కార్యక్రమంలో వందలాదిమంది హాజరయ్యారు. శుక్రవారం వలిమా కార్యక్రమాన్ని ఎంతో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కూడా వేలాదిమంది హాజరు కానున్నారు.

# కొత్తూరు సుబ్బరాయునిలో జడ్జి పూజలు.

ఎస్ . కొత్తూరు ,(కింగ్ )



ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానము నందు కర్నూలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కె.వి. రామక్రిష్ణయ్య గురువారం పూజలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ శర్మ, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామివారికి అభిషేకం, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంత ఆశీర్వ మంటపము నందు జడ్జి వారికి శాలువాలు, శేష వస్త్రములతో ఘనంగా సత్కరించి ప్రసాదం, స్వామివారి చిత్రపటము, ప్రసాదము అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జి కుటుంబ సభ్యులు, సిబ్బంది నాగేశ్వరరావు, పాణ్యం పీసీలు తదితరులు పాల్గొన్నారు.

# కోకో బీన్స్‌కు నాణ్యతా ప్రమాణాల రూపకల్పనపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్

రాజమహేంద్రవరం ,(కింగ్ )

ఆంధ్రప్రదేశ్‌లో కోకో సాగు నాణ్యతను మెరుగుపరచి అంతర్జాతీయ మార్కెట్లలో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు భారతీయ కోకో బీన్స్‌కు ప్రమాణాల రూపకల్పన అవసరమని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) ఆధ్వర్యంలో గురువారం రాజమహేంద్రవరంలోని ఐసీఏఆర్–ఎన్ఐఆర్‌సీఏలో నిర్వహించిన “ఎస్టాబ్లిషింగ్ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియన్ కోకో బీన్స్“ అంశంపై ఒకరోజు అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార ప్రాసెసింగ్, పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ, కోకో పంటకు ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రధాన ఉత్పత్తి కేంద్రంగా ఎదుగుతోందన్నారు. రైతులు నాణ్యత ప్రమాణాలను పాటించడం ద్వారా అధిక ధరలు పొందే అవకాశాలు పెరుగుతాయని, ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు నాణ్యమైన ముడి పదార్థం అత్యంత కీలకమని పేర్కొన్నారు. కోకో విలువ శృంఖల అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం ద్వారా కోకో ఉత్పత్తుల నాణ్యతను మరింత మెరుగుపరచవచ్చన్నారు. పంట అనంతర నిర్వహణ, ఫర్మెంటేషన్, ఎండబెట్టే విధానాల్లో అవగాహన పెంపు ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన ఉత్పత్తి సాధ్యమవుతుందని చెప్పారు. రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, పారిశ్రామికవేత్తలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.




చిరంజీవి చౌదరి మాట్లాడుతూ, నాణ్యమైన కోకో ఉత్పత్తి కోసం పరిశోధన, విస్తరణ సేవలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ కీలకమని వివరించారు. రైతులకు శాస్త్రీయ సాగు పద్ధతులపై నిరంతర శిక్షణ అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోకో నాణ్యతాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన ఉత్పత్తి సాధనపై ఉద్యానవన శాఖ దృష్టి సారించిందని తెలిపారు. ఏపీఎఫ్‌పీఎస్ సీఈఓ గెడ్డం శేఖర్ బాబు మాట్లాడుతూ, కోకో రైతులను ప్రాసెసింగ్ పరిశ్రమలతో అనుసంధానం చేయడం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం అందించడం సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. నాణ్యతా ప్రమాణాల ఏర్పాటు ద్వారా రాష్ట్ర కోకోకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కోకోశాల (చెన్నై) వ్యవస్థాపకుడు, కన్సల్టెంట్ నితిన్ చోర్డియా సాంకేతిక సెషన్‌లో మాట్లాడుతూ, అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో బీన్స్‌కు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో నాణ్యత ప్రమాణాలు అత్యంత ప్రాధాన్యమని చెప్పారు. కోకో గింజల ఫర్మెంటేషన్, ఎండబెట్టడం, గ్రేడింగ్, నిల్వ విధానాల్లో పాటించాల్సిన శాస్త్రీయ పద్ధతులను వివరించారు. చాక్లెట్, కోకో పౌడర్, కోకో బటర్ తదితర విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ అవకాశాలపై రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించారు. వక్తలు మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 38,671 హెక్టార్లలో కోకో సాగు జరుగుతోందని, ఏలూరు, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాలు కోకో ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వర్క్‌షాప్‌లో వెల్లడించారు. నాణ్యత పెంపు ద్వారా రైతుల ఆదాయాన్ని మరింతగా పెంచే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. కోకో సాగు, ప్రాసెసింగ్‌పై మార్గదర్శకాలకు 79950 87041 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను సంప్రదించాలి కోకో సాగు, కోకో బీన్స్ నాణ్యతా ప్రమాణాలు, ఫర్మెంటేషన్ మరియు ఎండబెట్టే శాస్త్రీయ పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపన తదితర అంశాలపై మరింత సమాచారం పొందాలనుకునే కోకో రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు), ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ. దుర్గేష్‌ను మొబైల్ నంబర్ +91 79950 87041 ద్వారా సంప్రదించి అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు, శిక్షణ కార్యక్రమాల వివరాలు, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన పొందవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యశాల లో ఉద్యానవన శాఖ డైరెక్టర్, ఏపీఎఫ్‌పీఎస్ సీఈఓ గెడ్డం శేఖర్ బాబు, కోకోశాల వ్యవస్థాపకుడు నితిన్ చోర్డియా, తూర్పు గోదావరి జిల్లా ఏపీఎఫ్‌పీఎస్ ఈడీ ఏ దుర్గేష్, ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ యు. సుధ, ఐదు జిల్లాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, కోకో ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులు, కోకో రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# సిలిండర్ పేలుడు బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ చేయూత.




వెలుగోడు ,(కింగ్ )

వెలుగోడు పట్టణంలోని గండిపేటలో గతవారం గ్యాస్ సిలిండర్ పేలి ఇంటితో సహా సర్వం కోల్పోయిన పుల్లయ్య కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్/గౌరవ జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు వెలుగోడు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ నాయకులు మునిరుద్దీన్, నాగ శేషులు ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల సహకారంతో గురువారం తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, డిప్యూటీ తహసిల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు వెలుగోడు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఒక ప్యాకెట్ బియ్యం, కిరాణా సరుకులు, రెడ్ క్రాస్ రాష్ట్ర కమిటీ పంపిన దాదాపు 5000 విలువైన వంట సామాగ్రి, 2 బెడ్ షీట్లు, దోమతెరలు అందజేశారు. ఈ సందర్భంగా మునిరుద్దీన్, నాగ శేషులు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు ఇల్లు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని కోరారు. తహసీల్దార్, ఎంపీడీవో మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# రెగ్యులర్ తహసీల్దార్ గా రామకృష్ణ నియామకం

గోకవరం

గోకవరం మండలం రెగ్యులర్ తహశీల్దార్ గా పినిశెట్టి రామకృష్ణ నియామకం అయ్యారు. ఇప్పటి వరకు ఇంచార్జీ తహసీల్దార్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం పలువురు డిప్యూటీ తహసీల్దార్ లకు పదోన్నతిలు కల్పించారు.అందులో భాగంగా ఇప్పటి వరకు ఇంచార్జీ తహసీల్దార్ గా ఉన్న పినిశెట్టి రామకృష్ణను రెగ్యులర్ తహసీల్దార్ గా నియమించారు. పూర్తి స్థాయిలో రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. గోకవరం ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే రామకృష్ణ ను పూర్తి స్థాయిలో తహసీల్దార్ గా నియామకం చెయ్యడంతో ప్రజలు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.



"This newspaper/periodical is published by KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH from D. NO. 24-11/2-14, LANKAVARI VEEDHI, BHAVAJIPETA, 4TH LINE, NEAR MAHALAXMIGUDI, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520003.on behalf of KALIDINDI RAJA JAGADESHWAR SANTOSH, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by PETTA VENKATA SURYANARAYANA at SREE SESHASAI ENTERPRISES. 3-88, CHANDRA THEATRE, MAIN ROAD, GOSALA, KRISHNA, ANDHRA PRADESH - 521151."